గిరిజన టీచర్లకు ఏఐపై శిక్షణ

- నేటినుంచి మే30 వరకు కొనసాగింపు
- త్వరలో ఆశ్రమ పాఠశాలల్లో బోధన



గిరిజన ఆశ్రమ పాఠశాల

మహబూబాబాద్ అర్బన్: జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును బోధించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో జిల్లాలో 18మండలాల్లోని 19గిరిజన ఆశ్రమ పాఠశాలలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేయనున్నది. ఈనెల 28వ తేదీ నుంచి ఏఐ కోర్సుపై ఉపాధ్యాయులకు, సీఆర్టీలకు ప్రత్యేక శిక్షణను ప్రారంభించనున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో, ఈ ప్రయోగాత్మక నిర్ణయం ద్వారా విద్యార్థుల బుద్ధి వికాసాన్ని పెంపొందించడంతోపాటు, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే అవకాశాలు లభిస్తాయని గిరిజనశాఖ అధికారి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

469మందికి శిక్షణ

రెగ్యులర్ ఉపాధ్యాయులు 360 మంది, కాంట్రాక్టు పద్ధతిలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారు 109 మంది సీఆర్టీలు పనిచేస్తున్నారు. వీరికి ఈనెల 28 నుంచి మే 30వ తేదీ వరకు శిక్షణ ఉంటుంది. ఉపాధ్యాయులను 15మందికి ఒక బ్యాచ్‌గా విభజించి, ఒక్కోరోజుకు ఒక్కో బ్యాచ్‌కు సెక్షన్లు చొప్పున ఉదయం 10నుంచి సాయంత్రం 4:45గంటల వరకు కృత్రిమ మేథాపై అవగాహన కల్పించి శిక్షణ అందిస్తారు. 3వ, 4వ, 5వ తరగతుల్లో ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలు ఉండటంలేదని ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నారు.

సిగ్నల్, విద్యుత్ ప్రధాన సమస్య..

జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం ప్రాంతాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సిగ్నల్, విద్యుత్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ ఉండకపోవడం, ఎయిర్‌టెల్ సిగ్నల్, ఇంటర్నెట్ డేటా సరిపోక మధ్యలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. అంతరాయం లేని సిగ్నల్స్ , టెలివిజన్ తెరను అమర్చాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు హాజరుకావాలి



ఏఐ ఆధారిత లెర్నింగ్ టూల్స్ ద్వారా విద్యార్థుల బలహీనతలను గుర్తించి, వారి సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు టీచర్లు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణతో ఇది విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస శైలిని మెరుగుపర్చడంలో సహాయపడనుంది. తప్పనిసరిగా ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాలి. హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం.

– గుగులోతు దేశీరాం నాయక్, జిల్లా గిరిజన శాఖ అధికారి

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


విద్యార్థులకు ఆటవస్తువులను అందజేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని చీన్యాతండా జీపీలో ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే మే నెల 31వరకు ఉచితంగా వేసవి శిక్షణా శిబిరం, ప్రేరణ సదస్సు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు లైబ్రరీ కోసం 500పైగా వస్తువులు, ఇంగ్లిష్ డిక్షనరీలు, గ్రామర్ పుస్తకాలు, స్వామి వివేకానంద గ్రంథాలు, నోట్‌బుక్స్, కంప్యూటర్లు, ఆటవస్తువులను డీఈఓ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్, క్యాంపు నిర్వాహకులు జయకృష్ణ, మోహన్, అదనపు డీఎంహెచ్ఓ శ్రీనివాస్, రాజారాం, మాజీ సర్పంచ్ అరుణ, హరిచంద్, దేశ్యా, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఈసందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిలీనియం యూత్ అసోసియేషన్ కేసముద్రం అధ్యక్షుడు పట్ల కరుణాకర్, వడ్డేపల్లి రమేష్, ఉపాధ్యక్షులు కాలేరు శిల్ప, శోభా, నళిని, రేణుకా, సంధ్యాలక్ష్మీ, శ్రీలత, ఖాజాపాషా, బొల్లెద్దు అనిల్, ప్రతాప్, బోడ శ్రీను, యాకస్వామి, బానోతు రమేష్, రాముడు, మిట్టగడుపుల కరుణాకర్, సంతోష్, యుగేందర్ పాల్గొన్నారు.

నెల్లికుదురులో..

నెల్లికుదురు: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో 2003–04లో బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండలం కేంద్రంలోని ఓ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను శాలువాలతో సన్మానించారు.

క్లుప్తంగా

సభ విజయవంతం కావాలని పూజలు



కురవి: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ప్రతిష్టాత్మకంగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభ విజయవంతం కావాలని కోరుతూ ఆదివారం కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సభకు బయలుదేరిన బీఆర్ఎస్ శ్రేణులకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా తయారు చేయించిన గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలి నరహరిగౌడ్, నూతక్కి సాంబశివరావు, బోడ శ్రీను, బాదె నాగయ్య, కొణతం విజయ్, నూతక్కి నరసింహరావు, అల్లూరి కిశోర్‌వర్మ, చిన్నం భాస్కర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా పరిశీలన

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని గ్రామాలు, తండాజీపీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి గెజిటెడ్ ఆఫీసర్లు ఆదివారం పరిశీలన చేశారు. లక్ష్మీపురం తండా గ్రామంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి, బలరాం తండా గ్రామంలో డీటీ నాగరాజు అర్హుల జాబితాను పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, మండల పంచాయతీ అధికారి పార్థసారథి, కార్యదర్శులు రజిత, నరేష్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసపత్రం, రివార్డు అందజేత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ సీఐగా పనిచేస్తున్న పెండ్యాల దేవేందర్ తన విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నత అధికారులు ఆయనకు ప్రశంసపత్రం, నగదు రివార్డు అందజేసి అభినందించారు. హైదరాబాదులోని టీఎస్ న్యాబ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రివార్డును స్వీకరించారు.

కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

మరిపెడ రూరల్: మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి రోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి జిల్లా కోర్డినేటర్ ఐనాల పరశురాములు, మాజీ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, నిర్వాహకులు శివరంగా, పలు గ్రామాల కోఆర్డినేటర్లు సువార్త, సతీష్, మంజుల, కృష్ణమూర్తి, తుల్సా నాయక్ పాల్గొన్నారు.

హత్యాయత్నం ఘటనలో పలువురి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని పాత బజారులో ఈనెల 21వ తేదీ రాత్రి జరిగిన హత్యాయత్నం ఘటనలో నమోదైన కేసులో భాగంగా ఎనిమిది మంది యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆదివారం తెలిపారు. మక్కాల తరుణ్‌పై పలువురు యువకులు దాడి చేసి గాయపర్చగా అతడి తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. టౌన్ ఎస్సై బి విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి దాడికి కారణమైన మల్లేష్, మురళి, చిరంజీవి, విగ్నేష్, రాజేష్, నవీన్, సాయి, వంశీని అరెస్టు చేయగా లక్ష్మణ్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కేసముద్రం: కేంద్ర పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్నారని, ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నిర్వహించిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో వారు మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు జల్లె యాకాంబ్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, రావుల మురళీ, కదిర సురేందర్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, పోలెపాక నాగరాజు, దామరకొండ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ‘కగార్’ను నిలిపివేయాలి


నెహ్రూసెంటర్: నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: గిరిజన, ఆదివాసీలపై చేపట్టిన ఆపరేషన్ కాగర్‌ను వెంటనే నిలిపివేయాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్, బహుళజాతి కంపెనీల కోసం కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో దాడులను నిర్వహిస్తుందని ఆరోపించారు. ఆదివాసీ గూడేల్లో కేంద్ర బలగాలను దింపి అమాయక ఆదివాసీలపై, గ్రామాలపై చేపడుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో మోహరించిన కేంద్ర బలగాలను వెనక్కి పిలవాలని, మావోలతో శాంతి చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు హరినాయక్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షురాలు ఎండీ.రజియా, కత్తుల రేణుక, సోమారపు ఐలయ్య, భూక్య సత్యనారాయణ, చలగొల్ల వెంకన్న, బానోత్ మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

బయ్యారం: ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బయ్యారంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు మోకాళ్ల మురళీకృష్ణ, డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, భిక్షం, వీరభద్రం, రాకేష్, వెంకన్న, మురళి, నాగేశ్వరరావు, భగవాన్ పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దు

బయ్యారం: మైనర్లకు మోటర్ సైకిళ్లు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎస్సై తిరుపతి తల్లిదండ్రులకు సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మోటర్ సైకిళ్లు నడుపుతున్న మైనర్లను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై బంగారు భవిష్యత్‌ను ఇబ్బందులపాలు చేసుకుంటున్నారని ఈ విషయంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి


మాట్లాడుతున్న గడ్డం కృష్ణ

నెహ్రూసెంటర్: రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా అణగారిన వర్గాలకు హక్కులు అందేలా, పూలే, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని కేయూ ప్రొఫెసర్ గడ్డం కృష్ణ అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జన జాతర సదస్సును జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ, హక్కుల అమలు కోసం అధికారంలో ఉన్న పాలక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో నిర్వహించడం లేదని విమర్శించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జీజేసీ ప్రిన్సిపాల్ ఫిరోజ్ గణేశ్, దుడ్డెల రామ్మూర్తి, చీపిరి యాకయ్య, చాగంటి ప్రభాకర్, కిషన్‌నాయక్, పీరయ్య, సుధాకర్, శామ్యూల్, వెంకన్న పాల్గొన్నారు.

ఉగ్రవాదులను శిక్షించాలని నిరసన


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గార్ల: పహల్గాంలో హిందూ టూరిస్టులను హతమార్చిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గార్లలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. అమాయక హిందువులపై జరిగిన ఉగ్రదాడిని యావత్ ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండిస్తుందన్నారు. ఈ ర్యాలీలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, డి జనార్దన్, భీముడు, వీరన్న, లోకేష్, వెంకటేష్, ఉపేందర్‌రెడ్డి, నాగయ్య, భిక్షం, రమేశ్, నాగేష్, సత్యం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు


మహబూబాబాద్: జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్


దంతాలపల్లి: జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. కేసీఆర్ సభకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను బీఆర్ఎస్ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. – సాక్షి నెట్‌వర్క్

పశువుల దొంగల అరెస్టు

కురవి: కురవితోపాటు, ఇతర మండలాల్లో కొద్దిరోజుల నుంచి కొంతమంది వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి గ్రామాల్లో పశువులను దొంగిలించుకుని అమ్ముకుంటున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం ప్రకారంగా వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండలం నేరడ ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం కేసముద్రం ఎస్సై జి.కరుణాకర్, కురవి ఏఎస్సై వెంకన్న, సిబ్బంది రమేశ్, కాశీరాం, రమేశ్‌బాబుతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో నెల్లికుదురు నుంచి కురవి వైపునకు వస్తున్న టీఎస్ 26టీ 9193 అశోక లేల్యాండ్ వాహనం, పోలీసులను చూసి వెనుకకు తిప్పుకుని వెళ్తుండగా, అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో అందులో ఒక ఆవు, ఒక గేదె ఉన్నట్లు గుర్తించారు. పశువులను ఎక్కడ కొన్నారని, ఎందుకు వాహనాన్ని ఆపకుండా పారిపోతున్నారు? అని వాహనంలో ఉన్న వ్యక్తులను ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారిని విచారించగా అందులో కురవి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు, నెల్లికుదురు మండలానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నట్లు గుర్తించారు. ఐదుగురు వ్యక్తులు కలిసి గత సంవత్సరం నుంచి చుట్టు పక్కల ప్రాంతాల్లో పశువులను దొంగతనం చేసి అమ్ముకుంటూ వచ్చిన డబ్బులను వారి జల్సాలకు వాడుకుంటున్నట్లు సీఐ తెలిపారు. ఈమేరకు ఒక ఆవు, ఒక గేదెను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని జప్తు చేసినట్లు తెలిపారు. ఐదుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇలాంటి నేరాలను ఎవరైనా పాల్పడితే కఠిన శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. రజతోత్సవ సభతో రాష్ట్ర రాజకీయాలలో మార్పు వస్తుందన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. – సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్ అర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న మాజీ వార్డు కౌన్సిలర్లు


మహబూబాబాద్ రూరల్: దామ్యతండాలో..


మహబూబాబాద్: జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, సత్యవతి రాథోడ్


నెల్లికుదురు ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో..


కేసముద్రం: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


మరిపెడ రూరల్: అబ్బాయిపాలెంలో..


కురవిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తహసీల్దార్ మహేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు ఉదయం 9 గంటల సమావేశం ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో డి.లక్ష్మీనారాయణ అనే వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. అదే విధంగా గోపా డివిజన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ లక్కాకుల సత్యనారాయణ, యర్నం శ్రీరాములు, బోగోజు నాగేశ్వరాచారి, కొత్త జగన్మోహన్‌రెడ్డి, చింత కరుణాకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: ఉర్దూ ఘర్, షాదీఖానా మండల నూతన కమిటీని మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో ఆదివారం ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ సలహాదారులుగా ఎండి.అయూబ్‌ఖాన్, షేక్ రషీద్, అమీర్, మహబూబ్, హశం, షబ్బీర్, ఎండీ.రఫీఖాన్, నవాజ్, నయీమ్, షేక్ ముజ్జు సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ రజాక్‌ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్కే.అమీర్, షేక్ జలాల్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ జలీల్, సయ్యద్ నాగుల్‌మీరా, జానీ, ఎండీ.అవీర్, ప్రధాన కార్యదర్శులుగా మహమ్మద్ రఫీ, ఎండీ.మొయిన్, సహాయ కార్యదర్శులుగా ఎండీ.భాషా, షాజహాన్, చాంద్‌పాషా, నూరుద్దీన్, కోశాధికారిగా ఎండీ.తాజుద్దీన్, కార్యవర్గ సభ్యులుగా నజీర్, జకీర్, షేక్ నజీర్, యాకుబ్, రఫీ, షబ్బీర్, నాగుల్‌మీరా, సలీం, అంకుష్, భాషా, తాజుద్దీన్, అంకుష్ ఎన్నికయినట్లు పేర్కొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు

కేసముద్రం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 121వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్యక్షతన, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పాదిల నర్సింహరెడ్డి ఇంటి ఆవరణంలో పార్టీ శ్రేణులు ఆదివారం వీక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు బోగోజు నాగేశ్వరాచారి, గాంతి వెంకట్‌రెడ్డి, మల్యాల రాములు, రవిందర్, వీరన్న, వెంకటేష్, రమేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహాన్ని మరోచోట ఏర్పాటు చేయాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలోని దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠాపన స్థలం వేరే చోటకు మార్చాలని అఖిల పక్షం నాయకులు ఆదివారం కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విగ్రహ ప్రతిష్ఠాపన చేసే రోడ్డు గ్రామ పంచాయతీ కార్యాలయానికి, ఆలయానికి, కొమ్ములవంచ గ్రామానికి వెళ్లే ప్రధాన రాహదారి అన్నారు. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపడితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. తహసీల్దార్, కార్యదర్శికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ప్రవీణ్, శ్రవణ్, అల్లం సాయి, రాణి రెడ్డి పాల్గొన్నారు.

ఇల్లు మంజూరు చేయిస్తానని మోసం

మహబూబాబాద్ రూరల్: రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆదివారం తెలిపారు. చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన దేశగాని కృష్ణ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ ఆఫీస్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ గత ప్రభుత్వ హయాంలో కృష్ణకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పాడు. ఆ మాటలు నిజం అనుకుని నమ్మిన కృష్ణ బీఆర్ఎస్ నాయకుడు ధారాసింగ్‌కు రూ.5.10లక్షలు ఇచ్చాడు. కొద్ది రోజులకు ఇల్లు మంజూరు కాలేదని చెప్పడంతో మోసం చేశాడని తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై శివ కేసు నమోదు చేశారన్నారు.

పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక



నెహ్రూసెంటర్: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం సన్నాహక సమావేశం ఆదివారం సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా చిలుకమారి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా అనుమాండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వనపర్తి వెంకటేశ్వర్లు, కారంపాడి ఉపేందర్, మామిడాల శ్రీనివాస్, వంగ అమరేందర్, దేవరశెట్టి మల్సూర్, ప్రధాన కార్యదర్శిగా సామల నర్సయ్య, కార్యదర్శులు నామని సదానందం, వెల్దండ వేణు, రమేష్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, సలహాదారులుగా యాకాంబ్రం, కృష్ణమూర్తి, మార్కేండ ఎన్నికయ్యారు.

ఆస్తి తగాదాలో తమ్ముడి భార్యపై పెట్రోల్‌తో దాడి

మరిపెడ రూరల్: అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాల మధ్య తమ్ముడి భార్యపై పెట్రోల్ దాడి చేయడగా తృటిలో తప్పించుకున్న కోగా, ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని వీరారం గ్రామ శివారు మామిడి తోటలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత భార్యభర్తలు ఉమారవి కథనం ప్రకారం.. వీరారం గ్రామంలో వారికి ఉన్న 5ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో సల్లా సత్యనారాయణ, సల్లా రవి అన్నదమ్ముల మధ్య పదేళ్లుగా గొడవలు, కేసులు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో అన్న సల్లా సత్యనారాయణ భూమి తనదేనని, తన ఆధీనంలో ఉంచుకొని సాగు చేసుకుంటున్నాడు. ఐదు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఉన్న మామిడితోటలో తమ్ముడు రవి, అతడి భార్య ఉమా దంపతులు కూలీలతో కలిసి వచ్చి మామిడి కాయలు కోస్తున్నారు. విషయం తెలిసిన అన్న సత్యనారాయణ కోసంతో పెట్రోల్ బాటిల్‌తో వచ్చి తమ్ముడి భార్య ఉమాపై దాడి చేయడానికి ప్రయత్నించగా ఆమె తృటితో తప్పించుకుంది. పక్కనే ఉన్న ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. అదేవిధంగా కారు అద్దాలు సైతం ధ్వంసం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.